క్లుప్తంగా

డైరీ, క్యాలెండర్లు ఆవిష్కరణ



డైరీలు ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, తదితరులు

ఎర్రుపాలెం: మండలంలోని బనిగండ్లపాడు గ్రామ పర్యటనకు విచ్చేసిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదివారం తెలంగాణ డివిజన్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ డైరీ, క్యాలెండర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఏఓ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు షౌకత్ హుస్సేన్, సెక్రెటరీ మల్లికార్జున్‌రెడ్డి, కోశాధికారి శ్రీనివాసరెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్ రామకృష్ణ, రాష్ట్ర సభ్యులు రాంబాబు, శివకుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కుర్నవల్లిలో ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న సత్తుపల్లి డీఈ, ఏడీఈ, ఏఈలు

తల్లాడ: మండలంలోని కుర్నవల్లి గ్రామంలో శనివారం రైతుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన 100 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరా చేశారు. లో ఓల్టేజీ సమస్యను అధిగమించేందుకు సత్తుపల్లి డివిజనల్ ఇంజనీర్ ఎల్.రాములునాయక్, తల్లాడ ఏడీఈ ఎస్.సతీష్, కుర్నవల్లి ఏఈ డి.కృష్ణకాంత్ కుర్నవల్లి సబ్ స్టేషన్ పరిధిలో ట్రాన్స్ ఫార్మర్‌ను పరిశీలించి రైతులకు విద్యుత్ సరఫరా ప్రారంభించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులు అందిస్తున్న నాయకులు

కల్లూరు: స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు మట్టా దయానంద్ విజయ్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ భాగం నీరజాదేవిలు మండలంలోని లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో రైతులకు ఉపయోగపడే అధునాతన నూతన యంత్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు పసుమర్తి చందర్‌రావు, ఏనుగు సత్యంబాబు, ప్రభాకర్‌రావు, నగేష్, నరసింహారావు, శ్రీకాంత్, రంగా తదితరులు పాల్గొన్నారు.

మిల్లు కాలుష్యంపై ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యే కూనంనేనికి వినతిపత్రం అందిస్తున్న కొణిజర్ల ఎస్సీ కాలనీ వాసులు

కొణిజర్ల: రైస్ మిల్లు నుంచి వస్తున్న దుమ్ము ధూళి నుంచి కాపాడాలని కోరుతూ కొణిజర్ల ఎస్సీ కాలనీ వాసులు ఆదివారం కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు ఫిర్యాదు చేశారు. ఎటువంటి జాగ్రత్తలు తీసుకోకుండా మిల్లు నడపడంతో.. వచ్చే దుమ్ము, ధూళితో కాలనీ వాసులంతా దగ్గు, అలర్జీ, తదితర వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నామని, విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు. దీంతో స్పందించిన కూనంనేని పొల్యూషన్ కంట్రోలు బోర్డు ఈఈకి ఫోన్ చేసి విచారణ చేసి తనకు నివేదిక ఇవ్వాలని ఆదేశించినట్లు తెలిపారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ చివరి సమావేశం

వైరా: వైరా మున్సిపాలిటీ పాలక వర్గం ఏర్పడి 5ఏళ్లు కానున్న నేపథ్యంలో మున్సిపల్ పాలక వర్గం పదవీ కాలం ఈ నెల 27తో ముగియనుంది. చివరి మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్ అధ్యక్షతన నేడు నిర్వహించనున్నట్లు కమిషనర్ చింతల వేణు తెలిపారు. ఈ సమావేశంలో గౌరవ సభ్యులందరికీ సన్మాన కార్యక్రమంతో పాటుగా పలు తీర్మానాలు కూడా కౌన్సిల్ ముందు ఉంచి ఆమోదం పొందనున్నట్లు తెలిపారు.

మండల కేంద్రానికి మహర్దశ

- త్వరలో మండలానికి బీటీ రోడ్డు
- డివైడర్లు, సెంట్రల్ లైటింగ్ పనులకు మోక్షం
- రూ.21 కోట్ల నిధులు మంజూరు
- ఆనందంలో స్థానికులు



ఎర్రుపాలెంలోని రింగ్ సెంటర్



అభివృద్ధి కానున్న ఎర్రుపాలెం ప్రధాన రహదారి

ఎర్రుపాలెం: డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మంజూరు చేసిన కోట్లాది రూపాయల నిధులతో మండలకేంద్రానికి మహర్దశ పట్టనుంది. ఎర్రుపాలెం మండలాభివృద్ధితో పాటు మండలకేంద్రంలో ప్రధాన రహదారి విస్తరణ (నాలుగు లేన్లు)అభివృద్ధి పనులకు కూడా రూ.18 కోట్లు నిధులు మంజూరు చేశారు. ఈ నెల 7న శంకుస్థాపన కూడా చేశారు. అదే విధంగా మండలంలోని పెగళ్లపాడు -ఎర్రుపాలెం రైల్వేస్టేషన్ రహదారిని బీటీ రోడ్డుగా మార్చేందుకు రూ.3కోట్ల నిధులు విడుదల కాగా.. ప్రస్తుతం అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. గత పదేళ్లుగా అభివృద్ధికి నోచుకోని గ్రామాలు భట్టి స్థానిక ఎమ్మెల్యే కావడంతో కోట్లాది రూపాయల నిధులను మంజూరు చేస్తున్నారు.

చేపట్టనున్న అభివృద్ధి పనులు..

ప్రభుత్వం మంజూరు చేసిన రూ.18 కోట్ల నిధులతో మండలకేంద్రంలోని ఆర్వోబీ డౌన్ నుంచి పోలీస్ స్టేషన్ సమీపంలోని రేమిడిచర్ల క్రాస్ రోడ్డు వరకు మధిర-విజయవాడ ప్రధాన రహదారి విస్తరణ పనులు, సైడ్ డ్రెయిన్లు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు, డివైడర్ల నిర్మాణ పనులు చేపట్టనున్నారు. డివైడర్లలో మొక్కలు కూడా నాటి పర్యావరణ సమతుల్య రక్షణకు చర్యలు తీసుకుంటారు.

తీరనున్న సమస్యలు..

ప్రధాన రహదారిపై ఇప్పటికే రింగ్ సెంటర్ (నాలుగు రోడ్ల కూడలి)లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. రహదారి విస్తరణ పనులు, డివైడర్ల నిర్మాణాలతో పలు సమస్యలు తీరనున్నాయి. ఇక్కడ కూడలి నుంచి ఏపీ రాష్ట్రం జయంతి, కంచికచర్ల వైపు, ఎర్రుపాలెంలోని జిల్లాపరిషత్ రోడ్డు, మధిర రోడ్డుకు మార్గాలున్నాయి. రింగ్ సెంటర్‌లో ప్రయాణం కష్టంగా మారింది. వాహన చోదకులు తమ తమ వాహనాలు ఎక్కడ బడితే అక్కడే పెట్టేసి వెళ్తున్నారు. రోడ్డు అంతా ఇరుకుగా ఉండడంతో.. షాపింగ్ కాంప్లెక్స్‌లో దుకాణదారులు రోడ్లపైకి వచ్చి విక్రయాలు జరుపుకుంటున్నారు. రోడ్డు విస్తరణ పనులతో దుకాణదారులకు కొంత మేర ఇబ్బంది ఉన్నప్పటికీ పనులు పూర్తి అయితే ఎటువంటి ప్రమాదాలు జరగకపోవడమే కాకుండా సెంటర్‌కు కూడా భవిష్యత్ ఉంటుందని స్థానికులు చెబుతున్నారు.

టెండర్ ప్రక్రియ ప్రాసెస్‌లో ఉంది..



మండలకేంద్రంలోని ప్రధాన రహదారి విస్తరణ, అభివృద్ధి పనుల నిమిత్తం ప్రభుత్వం రూ.18 కోట్లు నిధులు కేటాయించింది. ఇంకా ప్రస్తుతం టెండర్ ప్రక్రియ ప్రాసెస్‌లో ఉంది. టెండర్ ప్రక్రియ ఖరారు కాగానే పనులకు శ్రీకారం చుట్టేందుకు చర్యలు తీసుకుంటాం.

– రాజేష్, ఆర్అండ్‌బీ ఏఈ, ఎర్రుపాలెం

బస్ షెల్టర్ నిర్మించాలి..



మండలకేంద్రంలోని ప్రధాన రహదారి విస్తరణ చేస్తే ప్రయాణికులకు మేలు జరుగుతుంది. విస్తరణ, అభివృద్ధి పనుల్లో రోడ్డు డివైడర్లతో పాటు బస్ షెల్టర్ కూడా నిర్మిస్తే బాగుంటుంది. ప్రయాణికులు బస్సుల కోసం హోటళ్లలో, రోడ్డు మార్జిన్‌లలో వేచి ఉండాల్సి వస్తుంది.

– తాటికొండ మురళీచారి, బనిగండ్లపాడు

క్రీడా స్ఫూర్తితో యువకులు మెలగాలి



టోర్నీ విజేతగా నిలిచిన కారేపల్లి అంబేడ్కర్‌నగర్ యూత్ జట్టు

కారేపల్లి: క్రీడా స్ఫూర్తితో యువకులు మెలగాలని కారేపల్లి ఎస్ఐ ఎన్.రాజారాం అన్నారు. సంక్రాంతిని పురస్కరించుకొని కారేపల్లి హైస్కూల్ గ్రౌండ్‌లో అంబేడ్కర్ యువజన సంఘం యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నీలో ఫైనల్ మ్యాచ్‌ను ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఫైనల్ మ్యాచ్‌లో కారేపల్లి అంబేడ్కర్‌నగర్ యూత్ జట్టు, కారేపల్లి-ఏ జట్టు తలపడగా, అంబేడ్కర్‌నగర్ యూత్ జట్టు విజేతగా నిలువగా.. రన్నరప్‌గా కారేపల్లి-ఏ జట్టు నిలిచింది. దీంతో విజేతలకు మొదటి బహుమతిని కాంగ్రెస్ నాయకుడు ఇమ్మడి తిరుపతిరావు రూ.15వేలు, షీల్డు ఇవ్వగా.. రెండో బహుమతిని మేదరి టోనీవీరప్రతాప్ రూ.12వేలు, షీల్డును అందజేశారు. అదే విధంగా ప్రెస్ వర్సస్ పోలీస్ ఫ్రెండ్లీ మ్యాచ్‌లో.. కారేపల్లి ప్రెస్ జట్టు విజయం సాధించింది.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



హనుమ (ఫైల్)

మధిర: మండలంలోని కిష్టాపురం గ్రామానికి చెందిన మధిర స్విమ్మర్స్ అసోసియేషన్ ఆడిట్ సభ్యుడు భూక్యా హనుమ(42) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మూడు రోజుల క్రితం హనుమ కేబుల్ వైరు మరమ్మతులకై స్తంభం ఎక్కటంతో ప్రమాదవశాత్తు కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీంతో స్విమ్మర్స్ అసోసియేషన్ సభ్యులు సంతాపం తెలిపారు.

యోగి వేమనా.. నీకు వందనం

వేమన జయంతి వేడుకలు



వేమన శతక పద్య పోటీలలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

సత్తుపల్లిటౌన్: విశ్వదాభిరామ.. వినురవేమ.. అనే మాట వినని తెలుగువారు ఉండరని సృజన నిర్వాహకులు మధుసూదన్‌రాజు, రామకృష్ణ తెలిపారు. వేమన జయంతి సందర్భంగా స్థానిక విశ్వశాంతి విద్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వేమన శతక పద్య పఠన పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. తన పద్యాలతో తెలుగు భాష వ్యాప్తికి, సమాజ పురోగతికి తోడ్పడిన ప్రజాకవి, సంఘ సంస్కర్త యోగి వేమన అని, పద్యాలను నేర్చుకోవటం వలన నైతిక, మానవీయ విలువలు, జ్ఞాపకశక్తి పెంపొందిస్తాయన్నారు. ఈ దిశగా కృషి చేస్తున్న విశ్వశాంతి పాఠశాల యాజమాన్యాన్ని, ఉపాధ్యాయులను అభినందించారు. ప్రతి సంవత్సరం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వమే వేమన జయంతిని నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం నాగేశ్వరరావు, సత్యనారాయణ, ఉపాధ్యాయులు శైలజ, మణి, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దిగజారుడు రాజకీయాలు మానుకోవాలి

బోనకల్: బీఆర్ఎస్ నాయకులు దిగజారుడు రాజకీయాలు మానుకోవాలని కాంగ్రెస్ పార్టీ మధిర నియోజకవర్గ మహిళా కన్వీనర్ చేబ్రోలు రమా అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. మల్లు నందినిపై చేసిన వ్యాఖ్యలు ఉపసంహరించుకోకపోతే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు హేమూన్, సత్యనారాయణ, నాగరాజు, గోవింద్, వెంకటేశ్వర్లు, కృప తదితరులు తెలిపారు.

గ్రామసభలను అడ్డుకుంటాం

బోనకల్: మండలంలో 21నుంచి నిర్వహించే గ్రామసభల్లో నిజమైన అర్హుల ఎంపిక జరగకుంటే సభలను అడ్డుకుంటామని సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు అన్నారు. ఆదివారం కలకోటలో నిర్వహించిన ఆ పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న రోజుల్లో పేదల పక్షాన ప్రజాపోరాటాలు రూపొందించి పేదలకు అండగా ఉంటామన్నారు. ఈ సమావేశంలో నాయకులు ఏలేష్, శ్రీనివాసరావు, మత్స్యశాఖ సొసైటీ చైర్మన్ అచ్చయ్య, వెంకటమ్మ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం విజయవంతం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు భారవి, సుబ్బారావు, రంగారావు

వైరా: వైరాలోని సీపీఎం కార్యాలయంలో బోడేపూడి కళా నిలయం వారి ఆధ్వర్యంలో ప్రతి నెలా 3వ ఆదివారం నిర్వహించే బోడేపూడి వైద్య శిబిరం ఆదివారం విజయవంతంగా నిర్వహించారు. గత 115 నెలలుగా డాక్టర్ చీకటి భారవి, డాక్టర్ జట్ల రంగారావు, డాక్టర్ పిల్లలమర్రి సుబ్బారావులు వైరా పరిసర ప్రాంత ప్రజలకు వైద్య పరీక్షలు చేస్తూ ఉచితంగా మందులు అందజేస్తున్నారు. ఈ సందర్భంగా భారవి మాట్లాడుతూ.. చలి తీవ్రత ఎక్కువ ఉన్నందున గుండె, శ్వాసకోశ వ్యాధి ఉన్న వారు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యశిబిరం వాలంటీర్లు సుంకర సుధాకర్, చలపతిరావు, నాగేశ్వరరావు, సమత, రజిత, రజిని, రామారావు, మోహన్‌రావు, ప్రసాదరావు, సుధాకర్, రామకృష్ణ, చలపతిరావు, సత్యనారాయణ, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అందరికీ జాబ్‌కార్డులు ఇవ్వాలి



మాట్లాడుతున్న శ్రీనివాస్

సత్తుపల్లి/సత్తుపల్లిరూరల్: అర్హులైన ప్రతీ పేద కుటుంబానికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం వర్తించే అవకాశం కల్పించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, బీకేఎంయూ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దండు ఆదినారాయణ, సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు జాజిరి శ్రీనివాస్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం గంగారం ప్రజాసంఘాల కార్యాలయంలో, సత్తుపల్లిలో జరిగిన సమావేశాల్లో వారు మాట్లాడారు.

ఇంకా రాష్ట్రంలో 30 నుంచి 40శాతం మందికి ఉపాధిహామీ కార్డులు లేవన్నారు. ఈ సమావేశంలో నాయకులు వీరయ్య, రాజశేఖర్, నర్సింహారావు, బుచ్చయ్య, లక్ష్మణ్‌రావు, రాములు, శ్రీను, రామారావు, యాలాద్రి, కృష్ణ, సనందన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

చవకబారు విమర్శలు తగవు

మధిర: కాంగ్రెస్ నాయకులు అబ్బూరి కుటుంబంపై చవకబారు విమర్శలు చేయటం తగదని ఆత్కూరు గ్రామ మాజీ ఎంపీటీసీ సభ్యుడు మీనుగు పాండురంగారావు తెలిపారు. ఆదివారం మండలంలోని ఆత్కూరులో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాన్ని అబ్బూరి రామారావు ఎంతో అభివృద్ధి చేశారని తెలిపారు. ఈ సమావేశంలో గ్రామ మాజీసర్పంచ్ అప్పారావు, ఖమ్మంపాటి చిట్టిబాబు, మాజీ వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చాలి

ముదిగొండ: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని మాజీ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని పమ్మిలో నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు హరిప్రసాద్, వెంకట్‌గౌడ్, రమేష్, సీతారామయ్య, లక్ష్మారెడ్డి, శిల్వరాజు, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

మధిర: మధిర పట్టణంలోని భరత్ జూనియర్ కళాశాలకు చెందిన 1996–98 బ్యాచ్‌కు చెందిన ఇంటర్మీడియట్ పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమం ఏపీలోని పెనుగంచిప్రోలులో ఆదివారం నిర్వహించారు. సుమారు 27 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వెంకటేశ్వర్లు, మనోజ్‌కుమార్, సతీష్‌రెడ్డి, హరికృష్ణ, కృష్ణ, రాధ, నాగజ్యోతి, యుగంధర్, శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



వేంసూరు ఎత్తిపోతల పథకం ట్రయల్ రన్ ప్రారంభిస్తున్న దయానంద్, ఆనంద్ బాబు

వేంసూరు: రైతుల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు మట్టా దయానంద్ అన్నారు. ఇటీవల వైఎస్ బంజర్ వద్ద వేంసూరు ఎత్తిపోతల పథకం ట్రాన్స్‌ఫార్మర్ చోరీకి గురికాగా.. రూ.60 లక్షలతో నూతన ట్రాన్స్‌ఫార్మర్, మరమ్మతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం ఎత్తిపోతల పథకం ట్రయల్ రన్ ప్రారంభించి మాట్లాడారు. ఈ పథకం ద్వారా 3,700 ఎకరాలకు సాగునీరు అందడంతో పంట పొలాలు సస్యశ్యామలంగా మారుతాయన్నారు. రైతుల రుణమాఫీ, సన్నధాన్యానికి బోనస్, రైతు భరోసా ఇస్తూ వ్యవసాయాన్ని పండగ చేసిన ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని అన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సోమిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, శ్రీనివాసరెడ్డి, రంగారెడ్డి, బుచ్చాలు, రామిరెడ్డి, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభలు పారదర్శకంగా నిర్వహించాలి



కొణిజర్ల: మాట్లాడుతున్న డీఎల్‌పీఓ రాంబాబు



బోనకల్: మాట్లాడుతున్న ఎంపీడీఓ రమాదేవి

ఏన్కూరు/కారేపల్లి/కొణిజర్ల/కల్లూరురూరల్/తల్లాడ/చింతకాని/బోనకల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాలుగు పథకాలు ఇందిరమ్మ గృహాలు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డుల లబ్ధిదారుల ఎంపికకు ఈ నెల 21 నుంచి 23 వరకు గ్రామసభలు నిర్వహించనున్నట్లు డీఎల్‌పీఓ రాంబాబు, ఎంపీడీఓలు డి.చంద్రశేఖర్, రమేష్, చంద్రమౌళి, రామయ్య, రమాదేవి, కారేపల్లి, బోనకల్ మండల స్పెషలాఫీసర్లు గంగాధర్, విజయబాస్కర్‌రెడ్డి తెలిపారు. ఈ సదర్భంగా ఆదివారం వారు నిర్వహించిన సమావేశాల్లో మండలస్థాయి అధికారులతో మాట్లాడుతూ.. అర్హులై పేర్లు రాని వారు ఆందోళన చెందొద్దని.. మరళ దరఖాస్తు చేసుకోవాలన్నారు. గ్రామసభల ద్వారానే లబ్ధిదారులను ఎంపిక చేయటం జరుగుతుందన్నారు. హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి దరకాస్తులు స్వీకరించాలని సూచించారు. మండల ప్రజలు గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి రాంబాబు, తహసీల్దార్లు సీహెచ్ శేషగిరిరావు, సంపత్‌కుమార్, పున్నం చందర్, ఎంపీడీఓలు రోజారాణి, సురేందర్, ఎస్ఐ రాజారాం, డీటీ రాము, ఏడీఏ కరుణశ్రీ, వ్యవసాయాధికారులు నర్సింహారావు, బాలాజీ, ఎంపీఓలు జీవీఎస్ నారాయణ, రవీంద్రప్రసాద్, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా పోరుకు సిద్ధం కావాలి



చింతకాని: మాట్లాడుతున్న గోవిందరావు

చింతకాని/కొణిజర్ల: కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల, రైతు వ్యతిరేక విధానాలపై ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండపర్తి గోవిందరావు అన్నారు. ఆదివారం మండలంలోని చిన్నగోపతిలో గొడ్డుగొర్ల శ్రీను అధ్యక్షతన, శనివారం రాత్రి చింతకానిలోని రాఘవాపురంలో నిర్వహించిన రైతు సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల పట్ల సవతి తల్లి ప్రేమ కనబరుస్తున్నారన్నారు. బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి 50శాతం నిధులు కేటాయిస్తున్నారన్నారు. ఉపాధిహామీ పనులతో సంబంధం లేకుండా భూమిలేని నిరుపేదలందరికీ రూ.12 వేలు ఆర్థిక సాయం అందించాలన్నారు. రైతులకు పంటల బీమాతో పాటు రైతు బీమా వర్తింప చేయాలన్నారు. గ్రామ గ్రామాన తెలంగాణ రైతు సంఘాన్ని బలోపేతం చేయడానికి కార్యకర్తలు కృషి చేయాలన్నారు. దేశ సరిహద్దుల్లో రైతు నాయకుడు జగత్ సింగ్ దల్లేవాల్ ఆమరణ దీక్ష చేస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం స్పందించటం లేదన్నారు. ఈ సందర్భంగా చింతకాని సభలో రైతు సంఘం కమిటీని ఎన్నుకున్నారు. రైతుసంఘ గ్రామశాఖ నూతన అధ్యక్షుడిగా పుట్టబంతి సుదర్శన్, ప్రధాన కార్యదర్శిగా దొబ్బల బోసుతో పాటు 9మందితో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, రైతు సంఘం జిల్లా కోశాధికారి కూచిపూడి రవి, సీపీఐ మండల కార్యదర్శి మల్లికార్జున్‌రావు, సహాయ కార్యదర్శులు గోపాలరావు, మహేష్, రైతు సంఘం మండల అధ్యక్షుడు శ్రీను, సంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, నాయకులు లక్ష్మయ్య, వెంకటనర్సయ్య, సీతయ్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న వెంకటేశ్వర్లు

చింతకాని: మండలంలోని పందిళ్లపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లు సీసీ రోడ్డుకు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిప్యూటీ సీఎం భట్టి మంజూరు చేసిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం నిధులు రూ.20 లక్షల వ్యయంతో గ్రామంలో సీసీ రోడ్డును నిర్మించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు భాస్కర్, నాగార్జున్, నాగసూరారెడ్డి, కోటేశ్వరరావు, ప్రభాకర్‌రెడ్డి, జనార్దన్, వీరారెడ్డి, వీరభద్రం, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సభను జయప్రదం చేయండి

కొణిజర్ల: లెనిన్ శత వర్ధంతి సభ ఈ నెల 21న హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నారని ఆ సభకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సీవై పుల్లయ్య కంకణాల అర్జునరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం మండలంలోని రామనర్సయ్యనగర్, తీగలబంజలో సభకు సంబంధించిన పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు అప్పారావు, సీతారాములు, లక్ష్మణ్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ



నాగులవంచలో దుప్పట్లు అందిస్తున్న దృశ్యం

చింతకాని: మండలంలోని నాగులవంచ గ్రామంలో సీనియర్ సిటిజన్ ఆర్గనైజేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఆర్గనైజేషన్ అధ్యక్షుడు డాక్టర్ చంద్రమోహన్ వృద్ధులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్గనైజేషన్ కార్యదర్శులు జనార్ధన్‌రావు, సూర్యప్రకాష్‌రావు, కోశాధికారి సత్యనారాయణరెడ్డి, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సాగర్ జలాలు వృథా..

కాలువల్లో పూడిక తీయక రోడ్ల పాలు





ముదిగొండ-న్యూలక్ష్మీపురం ప్రధాన రహదారి పక్కనే వృథాగా పారుతున్న సాగర్ జలాలు

ముదిగొండ: మండలంలోని సాగర్ జలాలు విడుదల చేసినప్పటి నుంచి పలు కాలువల్లోని నీరు వృథాగా పోతుంది. మండలంలోని వరి, మొక్కజొన్న, మిర్చి పంటలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడంతో రైతులు సాగర్ జలాలపై ఆధారపడి ఎక్కువగా పంటలపై వినియోగిస్తారు. సాగర్ కాలువల్లో పేరుకుపోయిన చెత్తా చెదారం, పూడిక తొలగించకపోవడంతో కాలువల్లో నీరు బయటకు పొంగి రోడ్లపాలై పోతున్నాయి. చివరి భూములకు నీరందక దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఈ విషయాన్ని అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని, నీటిని వృథా కాకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.